క్లుప్తంగా

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


పనులను పర్యవేక్షిస్తున్న ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ సందీప్ సూచించారు. మంగళవారం కొత్తకోట గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసులు చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమ నిధులతో చేపట్టిన మురుగు కాలువ పనులను పరిశీలించారు.

పనులు కల్పించండి

సి.బెళగల్: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపాధిహామీ మేటీల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్యను పెంచాలన్నారు. మూడు రోజుల మేటీల శిక్షణలో భాగంగా మొదటి రోజు కొత్తకోట, ముడుమాల, ఈర్లదిన్నె, కొండాపురం, బ్రాహ్మణదొడ్డి గ్రామాల మేటీలకు శిక్షణ ఇచ్చినట్లు ఏపీఓ లక్ష్మన్న తెలిపారు. బుధవారం గుండ్రేవుల, సంగాల, పోలకల్, ఇనగండ్ల, సంగాల, పలుకుదొడ్డి గ్రామాల మేటీలు శిక్షణకు హాజరు కావాలన్నారు.

మత్స్యసహకార సంఘం అధ్యక్షునిగా శ్రీనివాసులు


అధ్యక్షునిగా శ్రీనివాసులును ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న సభ్యులు

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో మత్స్యసహకార సంఘం ఎన్నికలను మంగళవారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా మల్లికార్జున వ్యవహరించగా సహకార సంఘము సభ్యులు అధ్యక్షుడిగా బెస్త శ్రీనివాసులను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఆరవసారి ఎటువంటి పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు ఈ సందర్భంగా శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకారుల సంక్షేమానికి, అభివృద్ధికి కషి చేస్తానన్నారు. జాతీయ మత్స్యకారుల సంఘం ఉమ్మడి కర్నూలు జిల్లాల కో-ఆర్డినేటర్ బెస్త నాగశేషులు, కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షులు మదన్ గోపాల్, గ్యాస్ శ్రీనివాసులు ఏకగ్రీవ ఎన్నికలపై హర్షం వ్యక్తం చేశారు.

స్పెషల్ స్కూల్ తనిఖీ

సి.బెళగల్: మండల కేంద్రంలోని ప్రత్యేక ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల పరిసరాలను, రికార్డులను పరిశీలించి హెచ్ఎం సరోజినికి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, వంట పాత్రలు, పదార్థాలను శుభ్రంగా ఉంచుకోవాలని వంట నిర్వాహకులకు సూచించారు.

మూల పెద్దమ్మ ఆలయంలో భక్తుల సందడి


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ ఆయయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ తదితర విశేష పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలి


కలెక్టరేట్ ఎదుట కుటుంబ సభ్యులతో కలసి ధర్నా చేస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించాలని గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఆనంద్ కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నాకు దిగాడు. సర్వే నంబర్ 222 లోని 5 ఎకరాల భూమి గతంలో చుక్కల భూమిగా ఉండేదని, చుక్కల భూమి జాబితా నుంచి తొలగించి అసైన్డ్ భూముల జాబితాలో అధికారులు చేర్చారని తెలిపారు. దీంతో తన భూమిని విక్రయించుకోవడానికి అవకాశం లేకుండా పోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వంతో గ్రామాలు అభివృద్ధి బాట
- గోరుకల్లులో పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


గోరుకల్లులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ప్రజాసమస్యల పరిష్కారమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని, దీంతో గ్రామాలు అభివృద్ధి బాట పట్టాయని గుర్తు చేశారు. మండల పరిధిలోని గోరుకల్లు గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే కాటసాని 'గడపగడపకు–మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఆయా కాలనీల ప్రజలకు కాటసానికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఎమ్మెల్యే ముందుకు సాగారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను అందజేసిన కాటసాని ఆ మేరకు లబ్ధి చేకూరిందా... లేదా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వంలో కూడా ఇంతలా అభివృద్ధి సాధించలేదన్నారు. ప్రతి గ్రామానికి ఏటా కనీసం రూ.20కోట్ల వరకు అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు.

ఆదర్శంగా గోరుకల్లు...

నేడు గోరుకల్లు గ్రామం సీమలోనే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే కాటసాని గుర్తు చేశారు. ఇక్కడ ఉన్న జలాశయంతో 1.92లక్షల ఎకరాలకు సాగునీరు, 600కు పైగా గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. అలాగే కొత్తగా మరో 138గ్రామాలకు నీరు అందించే ప్రణాళిక సాగుతుందన్నారు. ఈ జలాశయంతో ఆయకట్టు కింద రైతులు రెండు కార్లకు నీరు పుష్కలంగా అందుతుందన్నారు. ఈ జలాశయంపై ఆధారపడి వందల కుటుంబాలు మత్స్య సంపదపై జీవిస్తున్నాయని గుర్తు చేశారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

గ్రామంలోని రూ.30లక్షలతో గోరుకల్లుకు జల్‌జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ పనులు చేపట్టి ప్రజలకు సురక్షిత మంచినీరు అందిస్తున్నామని ఎమ్మెల్యే కాటసాని గుర్తు చేశారు. అలాగే ఓహెచ్ఆర్ ట్యాంక్ పునఃరుద్ధరణకు రూ. 3.50లక్షలు ఖర్చు చేశామన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అదేవిధంగా అంతర్గత రోడ్లు, డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తున్నామని, ప్రజలకు అన్నిరకాల మౌళిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ జట్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ ఉసేన్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు గణేష్, జి. నాగిరెడ్డి, జి. సుబ్బారెడ్డి, లక్ష్మీమద్దయ్య, ఉసేన్‌సా, గోపాల్, మహబూబ్‌బాషా, శంకర్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్‌ఉసేన్, బాబు, రాజన్న, సుబ్బరాయుడు, ఈశ్వరయ్య, డీటీ మల్లికార్జునరెడ్డి, మండల ఇంజినీరు మహబూబ్‌బాషా, ఏఈ పుల్లయ్య, హౌసింగ్ ఏఈ అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఏం సంజన్నా... బాగున్నావా !

- ఎమ్మెల్యే కాటసాని పలకరింపుతో భావోద్వేగానికి గురైన నాటి కార్యకర్త
- నేను బాగానే ఉన్నా.. నీవు చల్లాంగా ఉండాలయ్యా అంటూ కన్నీరు
- పదిహేను నిమిషాలు చేయి వదలని వైనం... ఓదార్చిన రాంభూపాల్‌రెడ్డి


కాటసాని చేయిని నుదట పెట్టుకుని విలపిస్తున్న తులవ సంజన్న

పాణ్యం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గోరుకల్లు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అలనాటి కార్యకర్త తులవ సంజన్న ఇంటికి వెళ్లారు. 'ఏం సంజన్నా... బాగున్నావా' అంటూ ఎమ్మెల్యే కాటసాని ఆప్యాయంగా పలుకరిండంతో ఒక్కసారిగా అతను భావోద్వేగానికి గురయ్యాడు. అనారోగ్యంతో వీల్ స్టాండ్‌కు పరిమతమైన సంజన్న... నేను బాగానే ఉన్నానయ్యా... నీవు చల్లంగా ఉండాలయ్యా... అప్పుడే పదిమంది సంతోషంగా ఉంటారంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఎన్నాళ్లైంది నిన్ను చూసి... ఇంకా నాపేరు గుర్తు పెట్టుకున్నావా అంటూ కాటసాని చెయ్యి పుట్టుకుని నుదిట పెట్టుకుని బోరున ఏడ్చాడు. మీలాంటి వారి అభిమానం... దేవుని దయతో అందరం బాగా ఉన్నాం.. ఏడ్వొద్దంటూ కాటసాని ఓదార్చారు. దాదాపు ఇరవై నిమిషాలు చేయ్యి వదలకుండా పట్టుకుని అలనాటి జ్ఞాపకాలను ఆయన గుర్తు చేయగా... ఆ ప్రాంతం నిశ్శబ్ధంగా మారింది. అతను చూపుతున్న ఆప్యాయతా... అనురాగాన్ని చూసిన అధికారులు, ప్రజాప్రతినిధులు సైతం చెమ్మగిల్లారు. సంజన్నా... ఏదైనా సమస్య ఉందా.. ఎందుకు ఏడుస్తున్నావ్.. అని ఎమ్మెల్యే అడగ్గా ఏమి లేదయ్యా బాగున్నా.. నీవు బాగుండాలి అంతే అని మరోమారు కన్నీరు పెట్టుకోగా.. అధైర్యపడొద్దు... మిమ్మల్ని ఎప్పటికీ మరువను... నీకు నేనున్నా.. అంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని భరోసా ఇచ్చారు.

అర్జీల స్వీకరణ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

కోడుమూరు: మండలంలోని వెంకటగిరి గ్రామంలో మంగళవారం మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. తహసీల్దార్ జయన్న మాట్లాడుతూ మండల స్థాయిలో నిర్వహించే స్పందనతో పాటు, ప్రతి వారం ఒక గ్రామంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రజల ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పందనలో డీటీ రామాంజనేయులు, సూపరింటెండెంట్ క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తెలుసుకున్న నాయకుడు జగనన్న


ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న దృశ్యం

పాణ్యం: ప్రజల అవసరాలను తెలుసుకుని తీర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని సచివాలయాల మండల కన్వీనర్ జి. సుమంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొణిదేడులో సచివాలయం వద్ద సంక్షేమ ఫ్లెక్సీని ప్రదర్శించారు. అనంతరం ఎంపీటీసీ సభ్యులు రవిరెడ్డితో కలిసి గ్రామంలో పర్యటించారు. సంక్షేమ పాలనపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఇంటి వద్దకు సంక్షేమ పథకాలు అందజేస్తునన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వాదించాలని కోరారు.

దళారులను నమ్మి మోసపోవద్దు


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

కోడుమూరు: ప్రభుత్వ పథకాల మంజూరు కోసం లబ్ధిదారులు దళారులకు పైసా ఇవ్వాల్సిన పని లేదని, దళారులను నమ్మి మోసపోవద్దని హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి సూచించారు. మంగళవారం మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి, ఈఈ ప్రభాకర్ పర్యటించి ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్లు మంజూరైన లబిదారులతో మాట్లాడారు. జగనన్న కాలనీని సందర్శించి నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంలో ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాని పీడీ చెప్పారు. బిల్లుల మంజూరు కోసం ఎవరికి డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి

కల్లూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసుకుందామని కల్లూరు అర్బన్ క్లస్టర్-1 అధ్యక్షుడు భీమ శంకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ గోవర్ధన్ రెడ్డి, కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కల్లూరు అర్బన్ 29వ వార్డులో 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలకు తేడాను గమనించాలన్నారు. వార్డు సచివాలయంలో 33 రకాల సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్‌రెడ్డి, రత్నం, శివారెడ్డి, కృష్ణరెడ్డి, లోక్‌నాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బొల్లవరంలో వై నీడ్స్ ఏపీ జగన్

మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో వై నీడ్స్ ఏపీ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, జేసీఎస్ ఇన్‌చార్జ్ కేశవరెడ్డి, ఎంపీటీసీ ఆదిలక్ష్మి మాట్లాడుతూ జగనన్నతోనే సక్షేమ రాజ్యాం సాధ్యమన్నారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌బాషా, మస్తాన్, నూర్ అహ్మద్, హనుమంతురెడ్డి, కార్పొరేటర్లు లక్ష్మికాంతరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలి


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న నాయకులు

ఓర్వకల్లు: ఇంటింటా వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శ్రీరెడ్డి చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ సచివాలయం-1 పరిధిలో 'ఏపీకి మళ్లీ జగనే ఎందుకు రావాలి' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి చెన్నారెడ్డితో పాటు, జేసీఎస్ మండల కన్వినర్ లోటర్‌బాషా, సర్పంచ్ పెద్ద వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ముందుగా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించి, గ్రామంలో పర్యటించారు. పేద ప్రజలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ జగనన్న పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళీమోహన్, సచావాలయ కన్వీనర్లు డిష్ మగ్బుల్, రసూల్, వాయిదాబి, సచివాలయ సిబ్బంధి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వే పూర్తి చేయండి

గడివేముల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఈటపీఆర్డీ అబ్దుల్ ఖాలీక్ తెలిపారు. మంగళవారం గడివేముల ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో గడివేముల-1, 2, బిలకలగూడూరు గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో నిర్వహించి సమావేశంలో ఆయన మాట్లాడారు. 27వ తేది నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు కులగణన జరుగుతుందన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి


మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్

కోడుమూరు: పద్దెనిమిదేళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ జయన్నతో కలిసి ఆయన కోడుమూరులోని సాయిరాం, కేవీఆర్ డిగ్రీ కళాశాలల్లో విద్యార్థులతో సమావేశం నిర్వహించి ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించి తప్పులను సరిచేశారని, ఇంకా ఏవైనా అభ్యంతరాలుంటే ఫారం 6, 7, 8 ఫారాలలో ఫిర్యాదులు చేయాలని ఆర్డీఓ సూచించారు. సమావేశంలో ఎన్నికల డీటీ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఓ రఘువీరా, డీటీ రామాంజనేయులు పాల్గొన్నారు.

జీవనోపాధులను పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాముడు

గూడూరు: పొదుపు రుణాల ద్వారా మహిళలు జీవనోపాధులను పెంచుకోవాలని ఎంపీడీఓ రాముడు సూచించారు. మంగళవారం వైకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ మహిళలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడానికి ఎంఎంస్ సభ్యులు కృషి చేయాలన్నారు. గ్రామైఖ్య సమావేశాలు, రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆదర్శంగా జీవించాలన్నారు. సమావేశంలో ఏపీఎ సుధాకర్, ఎంఎంఎస్ అధ్యక్షురాలు సులోచనమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చెప్పినవన్నీ చేశాం కాబట్టే ఆశీర్వదించండి

– కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్

కర్నూలు సిటీ: ఎన్నికల హామీలన్నీ నెరవేర్చాము కాబట్టే వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీని ఆదరించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ కోరారు. 'ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలి' అంశంపై మంగళవారం కర్నూలు మండలం పడిదెంపాడు గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చాక నెరవేర్చారన్నారు. అన్ని వర్గాలకు ఆమోద యోగ్యమైన మేనిఫెస్టో తయారు చేసి నవరత్నాల్లాంటి పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పేదలు తమ పిల్లలను చదివించుకునేందుకు అమ్మఒడి, రైతుల పెట్టుబడి కోసం రైతు భరోసా, అవ్వతాతలకు అవసాన దశలో అండగా ఉండేందుకు వైఎస్సార్ పింఛన్ కానుకతో మరెన్నో పథకాలతో ప్రతి ఇంటికీ ఆర్థిక లబ్ధి చేకూర్చారన్నారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థలతో పాలనను ప్రజల ముంగిటకే తెచ్చారన్నారు. నాడు నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలను తీర్చిదిద్దారన్నారు. పారదర్శక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఎన్నుకోవాల్సిన అవసరముందని ప్రజలకు సూచించారు.

పెత్తందారుల కోసమే బాబు తాపత్రయం

చంద్రబాబు నాయుడు ఏ రోజు కూడా పేదల కోసం పని చేయలేదని ఎమ్మెల్యే సుధాకర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో మాత్రమే అడ్డగోలుగా హామీలిచ్చి ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. టీడీపీ వెబ్‌సైట్‌లో నుంచే ఎన్నికల మేనిఫెస్టోను సైతం మాయం చేశారన్నారు. పావలా ఖర్చు పెట్టి రూపాయి పబ్లిసిటీ చేసుకునే నైజం చంద్రబాబుదన్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో మరోసారి మాయమాటలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారని, ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సూచించారు. సంక్షేమ ఫలాలు అందాలన్నా, అభివృద్ధి పనులు కొనసాగాలన్నా మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ డి.వెంకటేశ్వమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ప్రసన్నకుమార్, ఈఓఆర్డీ అనురాధ, వైస్ ఎంపీపీ నెహిమియా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహబూబ్‌బాషా, సింగిల్ విండో చైర్మన్ శేషిరెడ్డి, నాయకులు కురువ వెంకటేశ్వర్లు, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు ఉపాధి పనుల కల్పనపై సమీక్ష

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల కల్పనపై ఈ నెల 23న సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ కుమార్‌సాయినాథ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా కరువు ఏర్పడిన ప్రాంతాలలో ఉపాధి పనులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా మండల అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు పాణ్యానికి అయోధ్య రామ అక్షింతలు

పాణ్యం: జిల్లా కేంద్రం నంద్యాల నుంచి బుధవారం పాణ్యానికి అయోధ్య రామ మందిరం అక్షింతలు రానున్నాయని శ్రీరామ జన్మభూమి క్షేత్ర ట్రస్ట్ , విశ్వహిందుపరిషత్ సభ్యులు జంపాల నాగరాజు, శంకరయ్య, వీరభద్రప్ప, బాలిరెడ్డి తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా కేంద్రంలో అయోధ్య రామమందిర అక్షింతలు వచ్చాయని, అక్కడి నుంచి ఆయా మండలా లకు వేరు చేసి సాయంత్రం పాణ్యం చేరుకుటాయన్నారు. పాణ్యం బస్టాండ్ నుంచి గ్రామంలోని అమ్మవారిశాల వరకు ర్యాలీగా వెళ్తున్నట్లు చెప్పారు.

మంత్రి మానవత్వం


108కు ఫోన్ చేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం

కోడుమూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తికి రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. మంగళవారం గోనెగండ్ల మండలం పుట్టపాశానికి చెందిన ముక్తార్ కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో కర్నూలు నుంచి కోడుమూరు వైపు వస్తుండగా కొత్తూరు వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ముక్తార్ తీవ్రంగా గాయపడ్డాడు. అదే సమయంలో ఆలూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మంత్రి జయరాం తన వాహనాన్ని ఆపి 108కు ఫోన్ చేసి గాయాలతో కొట్టుమిట్టాడుతున్న ముక్తార్‌ను ఆస్పత్రికి తరలించారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడంతో బాధితుడు కోలుకుంటున్నట్లు డాక్టర్లు తెలిపారు.

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం


భీష్మ, వేదవ్యాసుడు చిత్ర పటాలకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అండగా ఉందని, మత్స్య సంపదను మరింత పెంచేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం జాతీయ మత్స్యకార దినోత్సవం పురస్కరించుకోని గోరుకల్లు ఏర్పాటు చేసిన సమావేశంలో భీష్మ, వేదవ్యాసుడుల చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు ప్రత్యేక రాయితీలు అందించిన వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. పెరుగుతున్న చేపల విక్రయాలకు తోడు అవసరమున్న ప్రదేశంలో మత్స్య సంపదను మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామంలోని మత్స్యకారులకు శాశ్విత ఉపాధిగా గోరుకల్లు జలాశయం నిలిచిందన్నారు. అంతేకాక ప్రభుత్వం 'ఫిస్ ఆంధ్రా' పేరుతో స్వగ్రామంలోనే యువతకు ఉపాధి అవకశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం మత్స్యకారులతో మాట్లాడారు. చేపల పెంపకం, క్రయ, విక్రయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ ఉసేన్‌బాషా, ఎంపీటీసీ సభ్యులు గణేష్, మత్స్యకార సంఘం సభ్యులు చెంచులన్న, సుబ్బరాయుడు, లక్ష్మీమద్దయ్య, సూరి, శ్రీనివాసులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

దేవుడు ఒక్కడే రూపాలు వేరు


పూజల్లో పాల్గొన్న కాశీ జగద్గురు మల్లికార్జున పండితారాధ్య శివాచార్య మహా స్వాములు

కల్లూరు: అందరికీ దేవుడు ఒక్కడే అని, రూపాలు మాత్రం వేరు అని శ్రీ శ్రీ శ్రీ కాశీ జగద్గురు మల్లికార్జున పండితారాధ్య శివాచార్య మహా స్వాములు పేర్కొన్నారు. కల్లూరు మండలం పెద్దటేకూరు గ్రామంలో వెలసిన శ్రీ సిద్ధ రామలింగేశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక సప్తాహం కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి కాశీ జగద్గురు మల్లికార్జున పండితారాధ్య శివాచర్య మహా స్వాముల వారితో పాటు వివిధ పీఠాధిపతులు, మఠాధిపతులు, ధార్మిక సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాశీ జగద్గురు మల్లికార్జున పండితారాధ్య శివాచార్య మహా స్వాములు మాట్లాడుతూ సనాతన ధర్మానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఈ ధర్మం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేవుడు ఎక్కడో లేడు మన చుట్టు పక్కలే, మనం చేసే సేవ కార్యక్రమాల్లో న్నాడని వివరించారు. కార్యక్రమంలో తితిదే హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.